

ఎర్రగడ్డ ఆయుర్వేద ఆస్పత్రి ఎదుటి రోడ్డుపై మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

డ్రైనేజీలకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎర్రగడ్డ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): "ప్రమాదంలో ప్రజారోగ్యం" అనే శీర్షికతో, అపరిశుభ్రతకు ఆలవాలంగా మహానగరం అనే ఉపశీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి డ్రైనేజీలకు మరమ్మతులు నిర్వహించారు. రోడ్లపై పాడుతున్న మురుగు నీరు, దోమల విజృంభనతో డెంగీ, మలేరియా జ్వరాల వ్యాప్తి ప్రధాన అంశంగా ఈ వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన ఎర్రగడ్డ వాటర్ వర్క్స్ సబ్ డివిజన్ అధికారులు శనివారం మరమ్మతు పనులను నిర్వహించారు. సీవరేజ్ క్లినింగ్ వాహనంతో దాదాపు 6 నుంచి 7 మ్యాన్ హోల్‌లని శుభ్రం చేశారు. సమస్య పరిష్కారం అయినందుకు ఆయుర్వేద కళాశాల విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.



పోచంపల్లి చేనేత కార్మికులు నేసిన మూడు పట్టు చీరలను ఆలయ అధికారులకు అందజేస్తున్న తలసాని

ఎల్లమ్మ కల్యాణానికి ప్రతి ఒక్కరు పనిచేయాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అమీర్‌పేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం విజయవంతంగా నిర్వహించేందుకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా కల్యాణానికి వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని పలు శాఖల అధికారులను ఆదేశించారు. ఈ నెల 9న అమ్మవారి కల్యాణం జరుగనున్న నేపథ్యంలో శనివారం తలసాని వివిధ శాఖల అధికారులతో కలిసి ఆలయ పరిసరాలలో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే అమ్మవారి కల్యాణం వీక్షించేందుకు లక్షలాది మంది భక్తులు వస్తుంటారని, వారు ఏలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు.

అమ్మవారికి పోచంపల్లి పట్టు చీరలు

ఈ నెల 9న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం పురస్కరించుకుని ఎంతో పోచంపల్లి నేత కార్మికులు ఆలయంలో 10 రోజుల పాటు శ్రమించి నేసిన పట్టు చీరలను శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా ఆలయ ఈవో, చైర్మన్ సాయిబాబాకు అందజేసారు. మూడు సంవత్సరాలుగా అమ్మవారికి పట్టు వస్త్రాలను నేచి ఇస్తున్న ఎస్.ఎస్ జయరాజ్ బృందాన్ని కొనియాడారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం కావాలని పలువురు వక్తలు అన్నారు. విద్యా సంక్షోభాన్ని సర్కార్ గుర్తించాలని, ఎక్కువ నిధులు కేటాయించి సంస్కరణలు తేవాలని, విద్యపై నిర్లక్ష్యంతో ఒక తరానికే అన్యాయం చేయకూడదని వారన్నారు. జవహర్ బాల్‌మంచ్(జేబీఎం)సంస్థ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న విద్యామిషన్ పై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సంస్థ చైర్మన్ మామిడి రిషికేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, క్రాంతి తదితరులు హాజరై మాట్లాడారు.

ఆర్థికంగా ఎంత అభివృద్ధి సాధించినా విద్యావంతులైన మానవ వనరులు లేకపోతే అభివృద్ధి అసాధ్యమని అన్నారు. అత్యధిక యువత కలిగిన దేశాన్ని పటిష్ఠమైన దేశంగా మార్చాలంటే విద్యతోనే సాధ్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విద్యను పటిష్ఠం చేసే లక్ష్యంతో తీసుకొస్తున్న విద్యామిషన్‌కు ఇలాంటి సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యారంగంపై లోతైన అధ్యయనం చేయడంతో పాటు ముఖ్యమంత్రి అధ్యక్షతన సమగ్ర సమీక్ష నిర్వహించాలని అన్నారు. విద్యా రంగానికి అధిక నిధులు కేటాయిస్తూ క్షేత్రస్థాయిలో అమలుపై దృష్టి సారించాలని సూచించారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

● తెలంగాణ విద్యుత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల సాధనకోసం తెలంగాణ విద్యుత్ వర్కర్స్ యూనియన్ ఎప్పుడూ ముందుంటుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గాంబో నాగరాజు అన్నారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని తెలంగాణ విద్యుత్ వర్కర్స్ యూనియన్ (బి-2871) కార్యాలయంలో శనివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా యూనియన్ గౌరవ సలహాదారు రఘు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని, త్వరలో కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించుకునేందుకు యూనియన్ భవిష్యత్ కార్యాచరణ త్వరలో మొదలు పెట్టేందుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీ, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖదీర్ అలీ, ప్రధాన కార్యదర్శి నాగం సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరో లైబ్రరీని ప్రారంభించిన ఆకర్షణ

సనత్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు సేకరించి పేదలకు, అనాథలకు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల కోసం, స్కూళ్లల్లో లైబ్రరీలు ప్రారంభిస్తున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆకర్షణ సతీష్ మరో లైబ్రరీని ప్రారంభించింది. మల్కాజిగిరి పోచారంలో ఏపీఏజీఈ కేరింగ్ ఫర్ ఎయిడ్స్ అనాథ పిల్లల కోసం 400 తెలుగు పుస్తకాలతో తన 12వ లైబ్రరీని ప్రారంభించింది. డిసెంబర్ 2024 నాటికి 25 లైబ్రరీలు ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతుంది.

మహిళ పర్సు లాక్కెళ్లిన దొంగ

యూసుఫ్‌గూడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ఉన్న మహిళ పర్సును ఓ దొంగ లాక్కెళ్లిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్వీపర్‌గా విధులు నిర్వహించే వీరమ్మ ఈ నెల 4వ తేదీ నిమ్స్‌లో ఉన్న తన కోడలి వద్దకు వెళ్లింది. తిరిగి 5వ తేదీ ఆటోలో తిరిగి వస్తుండగా యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద టీ తాగేందుకు ఆటో డ్రైవర్ ఆటోను పక్కన నిలిపాడు. ఈ క్రమంలో ఓ దొంగ వచ్చి ఆటోలు ఉన్న వీరమ్మతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తూ ఒక్కసారిగా ఆమె పర్సును లాక్కుని పారిపోయాడు. దీంతో ఆమె చేతికి గాయమైంది. శనివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టాఫీస్‌లో దొంగతనానికి యత్నం

యూసుఫ్‌గూడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో దొంగతనం చేయటానికి గుర్తు తెలియని వ్యక్తులు విఫలయత్నం చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెంగళరావునగర్ పోస్టాఫీస్‌ను శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మూసి వెళారు. శనివారం ఉదయం 8.50 గంటలకు సబ్ పోస్ట్ మాస్టర్ వచ్చి తెరిచేందుకు వచ్చాడు. తాళాలు పగలకొట్టేందుకు ప్రయత్నించినట్లు గుర్తులు కనిపించాయి. అనుమానం వచ్చి తెరచి చూడగా ముందురోజు భద్రపరచిన ఫైల్స్, నగదు, స్టాంప్స్ తదితర వస్తువులు భద్రంగానే ఉన్నాయి. పోస్టాఫీస్ ఇళ్ల మధ్యలో ఉండటం, ఇక్కడ హాస్టల్స్ కూడా ఉండటంతో దొంగతనం చేయడం సాధ్యం కాలేదు. ఈ ప్రాంతంలో పోలీస్ గస్తీని పెంచాలని పోస్టాఫీస్ సిబ్బంది పోలీసులను కోరారు.

అయ్యప్ప సొసైటీలో అధ్వానం

● నివాసాలకు అనుగుణంగా లేని డ్రైనేజీ లైన్లు
● వీధుల్లోనే సీవరేజీ ప్రవాహం
● పాదచారులు, వాహనదారుల ఇబ్బందులు
● కొత్తలైన్లు నిర్మించాలని స్థానికుల డిమాండ్

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరంలో హైటెక్ సిటీకి సమీపంలోని అయ్యప్ప సొసైటీ అధ్వానంగా మారింది. ఏ వీధి చూసినా మురుగు ప్రవాహమే కనిపిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మూసీనదిలా సీవరేజీ నీరు వీధుల్లోనే పొంగిపొర్లుతోంది. వర్షాకాలం వస్తే 24 గంటల పాటు వీధులన్నీ మురుగునీటితో నిండి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో అయ్యప్పసొసైటీలోని ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. కనీసం వీధుల్లో నడువలేని పరిస్థితిని చూసి ఆవేదన చెందుతున్నారు. అయ్యప్ప సొసైటీలో వెలిసిన భవనాలకు ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో నీటి కనెక్షన్లు లేవు. ఫలితంగా వాటర్ అండ్ సీవరేజీ బోర్డుకు ఆదాయం రాకపోవడంతో జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైపులైన్ల సామర్థ్యాన్ని పెంచడం లేదు.

మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో స్థానికులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయ్యప్ప సొసైటీలో నిర్మాణాలు చేపట్టే క్రమంలో ఎవరికి వారే డ్రైనేజీ, సీవరేజీ పైపులైన్లు వేసుకున్నారు. ఆ లైన్లే నేటికీ దిక్కయ్యాయి. ఆ సొసైటీలో వెలిసిన భవనాలకు, సీవరేజీ లైన్ల సామర్థ్యానికి ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో మ్యాన్‌హోల్స్ పొంగి మురుగు వీధులను ముంచెత్తుతోంది. అయ్యప్ప సొసైటీలో రోడ్డు నెం.47 లో సీవరేజీ ఓవర్‌ఫ్లోతో కాలనీ మొత్తం మురుగు ప్రవహిస్తోంది. ఆ ప్రాంతంలోని వీధులన్నీ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సీవరేజీ ఓవర్‌ఫ్లో అయిన సందర్భంలో వాటర్‌బోర్డుకు ఫిర్యాదు చేయగానే సిబ్బంది వచ్చి క్లీన్ చేసి వెళ్తున్నారు. కానీ రెండు రోజుల్లో పరిస్థితి యథావిధిగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు.





అయ్యప్ప సొసైటీలో ప్రస్తుతమున్న నివాస సామర్థ్యాలకు అనుగుణంగా సీవరేజీ లైన్లు వాటర్‌బోర్డు అధికారులు వేయడం లేదు. మురుగు పొంగి పొర్లితే ఎయిర్‌టెక్ మిషన్‌తో క్లీన్ చేస్తున్నారే తప్పా.. శాశ్వత పరిష్కారం

కొత్త లైన్లు నిర్మించాలంటున్న స్థానికులు

చూపడం లేదు. అయితే సొసైటీలో పాత సీవరేజీ లైన్ సామర్థ్యం ఏమాత్రం సరిపోవడం లేదని వాటర్‌బోర్డుకు, ఎమ్మెల్యేకు, మంత్రులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జనాభాకు అనుగుణంగా సీవరేజీ లైన్లను పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయ్యప్ప సొసైటీలో సీవరేజీ బిల్లులు వేసి ఆదాయం పెంచుకునేందుకు వాటర్‌బోర్డు ప్రయత్నిస్తుందే తప్పా.. పైపులైన్ల సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టకపోవడం కొసమెరుపు.

బిల్లులేసేందుకు సిద్ధమవుతున్న బోర్డు

ఆదాయం పెంచుకోవడానికి వాటర్‌బోర్డు ఇటీవల సరికొత్త పంథాను ఎంచుకుంది. సాధారణంగా నీటి బిల్లు చేసే క్రమంలో అదనంగా సీవరేజీ సెస్ వసూళ్లు చేస్తోంది. వాటర్‌బోర్డు నీటి కనెక్షన్ల నుంచి ఇదే తరహాలో బిల్లులు వసూళ్లు చేస్తోంది. అయితే నీటి కనెక్షన్ లేని నివాసాలు కూడా నగరంలో చాలా ఉన్నాయి. వాటి నుంచి సీవరేజీ సెస్ వసూలు చేయడానికి ప్రయోగాత్మకంగా హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో వాటర్‌బోర్డు సర్వే చేసింది. చాలా వరకు అక్రమంగా భవనాలు నిర్మించి నల్లా కనెక్షన్ లేకుండా బోరునీటి మీద ఆధారపడుతున్నారని గుర్తించింది. ఆయా భవనాలు, ఇళ్ల సీవరేజీ కనెక్షన్లు వాటర్‌బోర్డు లైన్లకు అనధికారికంగా కలిపేశారు. దీంతో ఆయా భవనాల నుంచి సీవరేజీ బిల్లులు వసూలు చేసేందుకు వాటర్‌బోర్డు సిద్ధమవుతోంది. అయ్యప్ప సొసైటీలోని భవనాల నుంచి కూడా ఈ తరహా బిల్లులు వసూలు చేయడానికి చర్యలు చేపడుతోంది వాటర్‌బోర్డు.

ఇళ్లలో చోరీలు చేస్తున్న ముగ్గురి అరెస్టు

● బంగారు, వెండి ఆభరణాలు, అమెరికా డాలర్లు స్వాధీనం



నిందితుల నుంచి రికవరీ చేసిన నగలు, నగదును చూపిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీలు చేస్తున్న ముగ్గురిని ఫిలింనగర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి బంగారు, వెండి, అమెరికా డాలర్లు స్వాధీనం చేసుకున్నారు. ఫిలింనగర్ పోలీసు స్టేషన్‌లో శనివారం జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి వివరాలను వెల్లడించారు. తాజాగా నగర పోలీస్ కమిషనర్ సాయుధ బలగాలతో తనిఖీలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఫిలింనగర్ పోలీసులు ఈ నెల 5న తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూడగానే ద్విచక్ర వాహనంపై పారిపోయేందుకు ప్రయత్నించారు. ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుల్ జనార్థన్ చాకచక్యంగా వారిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వారి వెలిముద్రలు, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించగా వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఇళ్లలో చోరీలు చేసిన పది కేసుల్లో నిందితులుగా నిర్ధారణ అయింది. వారిని ప్రశ్నించగా ఆసిఫ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అలీ హంజైఫా, మహ్మద్ అజ్మల్ షరీఫ్ అలియాస్ నదీమ్, బహదూర్‌పురాకు చెందిన మహ్మద్ బిన్ బియాబనీ అని తేలింది. ఇందులో హంజైఫా గతంలో హుమాయూన్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వీరు ముగ్గురు కలిసి ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు, ఆసిఫ్‌నగర్ పీఎస్ పరిధిలో రెండు, గుడిమల్కాపూర్, నర్సింగి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చొప్పున చోరీ చేశారు. వీరి నుంచి 30 తులాల బంగారు ఆభరణాలు, 45 తులాల వెండి ఆభరణాలు, 100 అమెరికా డాలర్లు, రెండు సెల్‌ఫోన్లు, ఐదు రిస్ట్ వాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సాంకేతిక పొరపాటుతో సీనియర్ సిటిజన్‌కు ఈ చలాన్

● సమస్యను పరిష్కరించిన బంజారాహిల్స్ పోలీసులు
● అభినందించి, రివార్డులు అందజేసిన డీజీపీ రవిగుప్తా



బంజారాహిల్స్ ట్రాఫిక్ ఏఎస్ఐ భాగేందర్ సింగ్, కానిస్టేబుళ్లు రాఘువాచారి, మహ్మద్ ఇర్షాద్ అలీలను అభినందిస్తున్న డీజీపీ రవిగుప్తా

హైదరబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పొరపాటుతో చలాన్ రావడంతో ఓ మహిళా సీనియర్ సిటిజన్ బంజారాహిల్స్ పోలీసులను సంప్రదించింది. ఎంతో ఓపికతో ఆమె సమస్యను విని పరిష్కరించారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఏఎస్ఐ భాగేందర్ సింగ్ ఈనెల 1న మోర్ సూపర్‌మార్కెట్ వద్ద విధులు నిర్వహిసున్నారు. ఈ సమయంలో ఓ వృద్ధ మహిళ ఆయన వద్దకు వచ్చి తన కారుపై వచ్చిన చలాన్ గురించి అడిగింది. ఆమెను పోలీస్టేషన్‌లోకి మర్యాద పూర్వకంగా తీసుకెళ్లి ఆమెకు మంచినీరు ఇచ్చి, ఆమె సమస్యను అడిగి తెలుసుకున్నారు. తర్వాత కానిస్టేబుల్ రాఘవాచారి, మహ్మద్ ఇర్షాద్ అలీలు ఆమె వివరాలు తీసుకొని చలాన్లు పరిశీలించారు. సాంకేతిక పొరపాటుతో చలాన్లు వచ్చినట్లు గుర్తించి చలాన్లు తీసివేయాలని ఈ చలాన్ సెంటర్‌కు మెయిల్ చేశారు. పోలీసుల నుంచి ఆమెకు ఎదురైన అనుభవాన్ని గురించి, పోలీసులు ఎంతో మర్యాదగా మాట్లాడి సమస్య పరిష్కరించిన తీరును సదరు మహిళ డీజీపీకి లేఖ రాసింది. దాంతో డీజీపీ రవిగుప్తా బంజారాహిల్స్ ట్రాఫిక్ ఏఎస్ఐ బాగేందర్ సింగ్, కానిస్టేబుళ్ల రాఘవాచారి, మహ్మద్ ఇర్షాద్ అలీలను డీజీపీ కార్యాలయంలో అభినందించి రివార్డు సర్టిఫికెట్లు అందించారు.

12 నుంచి చేనేత ఎక్స్‌పో



బ్రోచర్ విడుదల చేస్తున్న స్వామి, భాస్కర్ తదితరులు

బర్కత్‌పుర, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడానికి, ఆత్మహత్యలను నివారించడానికి ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని పద్మశాలీ సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఈ నెల 12, 13, 14వ తేదీలలో పద్మశాలీ భవన్‌లో చేనేత ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షురాలు రూపసదాశివ, సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, సంఘం యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జి భాస్కర్‌లు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో 45 చేనేత స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 12న ఉదయం 10 గంటలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చేనేత కమిషనర్ శైలజారామయ్యార్ ముఖ్యఅతిథులుగా హాజరై ఎక్స్‌పోను ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో బి.మధుసూదన్, దేవేందర్, రాంచందర్, అంబటి శ్రీనివాస్, స్వప్న, నోముల రేఖ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ జరగకపోతే నిప్పురాజేస్తాం: వంగపల్లి

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఏర్పాటు చేసుకుని 30 ఏళ్ల గడుస్తున్నా సంబరాలు చేసుకోవాల్సింది పోయి వర్గీకరణ జరగకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 7న దీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు తానే బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పుకునే మంద కృష్ణ మాదిగ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తానని చెప్పి 10 ఏళ్ల గడుస్తున్నా ఇప్పటికీ మాదిగ జాతిని మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, శ్రీను, యాదగిరి, వేణుగోపాల్, కృష్ణ, నరేష్, రాహుల్, కొల్లూరి వెంకట్, చందు, జీవన్, నాగరాజు, సురేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి



ఫిలింనగర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు



బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఇద్దరు వ్యక్తుల అవయదానం

● పదమూడు మందిలో వెలుగులు
● గుండె, కాలేయం, లంగ్స్‌తో ఇతర అవయవాల దానం



సిరికొండు ప్రసాద్, నర్సింగ్‌రావు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తుల అవయవదానంతో పదమూడు మందికి పునర్జన్మ లభించింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తుల బ్రెయిన్ డెడ్ కావడంతో వారి నుంచి సేకరించిన మూత్రపిండాలు, కాలేయం, గుండె, లంగ్స్ కార్నియా అవయవాలను సేకరించి అవసరమైన వారికి మార్పిడి చేశారు. వరంగల్‌కు చెందిన ల్యాబ్‌టెక్నీషియన్ సిరికొండ ప్రసాద్ (36) గతనెల 27న బైక్‌పై వెళుతుండగా కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా శుక్రవారం పరిస్థితి విషమించడంతో బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ కో-ఆర్డిరేటర్స్ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో అవయవదానానికి అంగీకరించారు. సిరికొండ ప్రసాద్ నుంచి అవయవాలను సేకరించారు. కాగా, ఈస్ట్‌మారేడ్‌పల్లికి చెందిన టి.నర్సింగ్‌రావు (39) గతనెల 28న ద్విచక్రవాహనంపై నుంచి కింద పడ్డారు. వెంటనే అతని ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలు జరిపిస్తుండగా శుక్రవారం బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులకు జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్స్ అవగాహన కల్పించడంతో అవయవదానానికి ముందుకు వచ్చారు. దీంతో ఇరువురి నుంచి సేకరించిన అవయవాలను అవసరమైన 13 మంది బాధితులకు అమర్చారు.

సమాజసేవకు సమయాన్ని కేటాయించాలి

● హైకోర్టు న్యాయమూర్తి శ్రవణ్ కుమార్ వెంకట్

బంజారాహిల్స్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవకు విలువైన సమయాన్ని కేటాయించడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి శ్రవణ్ కుమార్ వెంకట్ అన్నారు. శనివారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ 2024-25 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్‌సేవలు తనకు తెలుసునని ఎంతో మంది పేదలకు సేవలు అందిస్తున్నారని చాలా మందికి ఆదర్శవంతంగా నిలుస్తున్నారని కొనియాడారు. రోటరీ క్లబ్ ద్వారా మరింత మందికి సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ 2024-25 ప్రెసిడెంట్‌గా టీఎంఎస్. చౌదరి, సెక్రటరీగా రాధే శ్యాం తివారి, పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు టీఎంఎస్ చౌదరి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని త్వరలోనే తెలంగాణలోని పలు జిల్లాల్లో డయాలసిస్ రోగులకు ఉచితంగా డయాలసిస్ చేసేలా కేంద్రాలు నెలకొల్పబోతున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే కేన్సర్‌కు సంబంధించిన పలు చికిత్సలను తాము ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ ఈడీ ప్రొఫెసర్ డాక్టర్ వికాస్ భాటియా, డిస్ట్రిక్ట్ 3150 ఇన్‌స్టలేషన్ ఆఫీసర్ శరత్ చౌదరి, ప్రెసిడెంట్ సుదేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మున్నూరుకాపులకు చోటు కల్పించాలి

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపు సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని మున్నూరు కాపు సంఘం తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణలో రెండు మంత్రి పదవులను తమ సామాజికవర్గానికి కేటాయించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, మున్నూరుకాపు కార్పొరేషనుకు రూ.2 వేల కోట్లను కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకోటి రాజు, కార్యదర్శి వాసాల వెంకన్న, ఆర్వీ మహేందర్, గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు దేశెట్టి శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ నిర్మాత స్వప్నవర్మ ఆత్మహత్య

మాదాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సినీ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్న ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన స్వప్నవర్మ మూడు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి మాదాపూర్ కావూరిహిల్స్‌లో నివాసం ఉంటుంది. ఈమె ఒంటరిగానే నివాసం ఉంటూ సినీ ఇండస్ట్రీలో ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తుంది. రెండు రోజుల క్రితం తాను ఉంటున్న ప్లాట్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్యహత్య చేసుకుంది. ఆమె ఉంటున్న ప్లాట్ నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూడగా ఉరేసుకుని చనిపోయింది ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంద కృష్ణ వైఖరితో మాదిగ జాతికి నష్టం

● బహిరంగ లేఖలో పేర్కొన్న మాదిగ జేఏసీ నేతలు

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి మాదిగ జాతి దూరం చేసే విధంగా ఎమ్మార్పీఎస్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనిపిస్తోందని, మంద కృష్ణ మాదిగ వైఖరి వల్లే మాదిగ జాతికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆరోపించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకులతో కలిసి మంద కృష్ణ మాదిగకు రాసిన బహిరంగ లేఖను ఆయన విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే వంద రోజులలో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన పార్టీ పది సంవత్సరాలు అయినా వర్గీకరణ చేయకపోతే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి మంద కృష్ణ మాదిగ ఎట్లా మద్దతు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు.

మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల నడిపిన పోరాటం ఫలితం ఇంకా ఎందుకు తేలలేదని, మూడు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానంలో మీరు ఎన్ని రాజకీయ పార్టీలకు మద్దతు ఇచ్చారు. మద్దతు పొందిన రాజకీయ పార్టీలు వర్గీకరణ చట్టాన్ని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అంజనా చౌదరి ఆధ్వర్యంలో రెండు రోజుల సృజన జాతీయ నృత్యోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రమ్యతేజ కూచిపూడి నృత్యం, రవికుమార్ బృందం లంబాడ నృత్యం, రిత్విక్ వెంకట్, చార్మీల సింహనందిని నృత్యం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.



చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్‌కు పదకొండు లక్షల రూపాయల చెక్కును అందజేస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండాసురేఖ తదితరులు

ఆషాడ బోనాల జాతరకు పదకొండు లక్షల రూపాయల చెక్కు అందజేత

బౌద్ధనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం, చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయంలో ఈనెల 28, 29వ తేదీల్లో జరిగే ఆషాడ బోనాల జాతరను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం కట్టమైసమ్మ ఆలయానికి పదకొండు లక్షల రూపాయలను మంజూరు చేసింది. శనివారం దేవాదాయశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కట్టమైసమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్, ఆలయచైర్మన్ గుంటికృష్ణకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండాసురేఖ, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పదకొండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు దేవేందర్ యాదవ్, అమృత్, జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌ముదిరాజ్, జానకి, ధర్మవీర్, ఎక్స్‌అఫిషియో సభ్యుడు, ప్రధానార్చకుడు తిరుమలాచార్యులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అవయవదానం

- పదమూడు మంది జీవితాల్లో వెలుగులు
- గుండె, కాలేయం, లంగ్స్‌తో ఇతర అవయవాల దానం

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తుల అవయవదానంతో పదమూడు మందికి పునర్జన్మ లభించింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తులు బ్రెయిన్‌డెడ్ కావడంతో వారి నుంచి సేకరించిన మూత్రపిండాలు, కాలేయం, గుండె, లంగ్స్ కార్నియా అవయవాలను సేకరించి అవసరమైన వారికి మార్పిడి చేశారు. వరంగల్‌కు చెందిన ల్యాబ్‌టెక్నీషియన్ సిరికొండ ప్రసాద్ (36) గతనెల 27న బైక్‌పై వెళుతుండగా కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా శుక్రవారం పరిస్థితి విషమించడంతో బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్స్ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో అవయవదానానికి అంగీకరించారు. సిరికొండ ప్రసాద్ నుంచి అవయవాలను సేకరించారు. కాగా, ఈస్ట్‌మారేడ్‌పల్లికి చెందిన టి.నర్సింగ్‌రావు (39) గతనెల 28న ద్విచక్రవాహనంపై నుంచి కింద పడ్డారు. వెంటనే అతనిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలు జరిపిస్తుండగా శుక్రవారం బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులకు జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్స్ అవగాహన కల్పించడంతో అవయవదానానికి ముందుకు వచ్చారు. ఇరువురి నుంచి సేకరించిన అవయవాలను అవసరమైన 13మంది బాధితులకుఅమర్చారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం కావాలని పలువురు వక్తలు అన్నారు. విద్యా సంక్షోభాన్ని సర్కార్ గుర్తించాలని, ఎక్కువ నిధులు కేటాయించి సంస్కరణలు తేవాలని, విద్యపై నిర్లక్ష్యంతో ఒక తరానికే అన్యాయం చేయకూడదని వారన్నారు. జవహర్ బాల్‌మంచ్(జేబీఎం) సంస్థ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న విద్యామిషన్‌పై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సంస్థ చైర్మన్ మామిడి రిషికేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, క్రాంతి తదితరులు హాజరై మాట్లాడారు. ఆర్థికంగా ఎంత అభివృద్ధి సాధించినా విద్యావంతులైన మానవ వనరులు లేకపోతే అభివృద్ధి అసాధ్యమని అన్నారు. అత్యధిక యువత కలిగిన దేశాన్ని పటిష్ఠమైన దేశంగా మార్చాలంటే విద్యతోనే సాధ్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్యను పటిష్ఠం చేసే లక్ష్యంతో తీసుకొస్తున్న విద్యామిషన్‌కు ఇలాంటి సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యారంగంపై లోతైన అధ్యయనం చేయడంతోపాటు ముఖ్యమంత్రి అధ్యక్షతన సమగ్ర సమీక్ష నిర్వహించాలని అన్నారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తూ క్షేత్రస్థాయిలో అమలుపై దృష్టి సారించాలని సూచించారు.

మంత్రివర్గంలో మున్నూరుకాపు సామాజిక వర్గానికి చోటు కల్పించాలి

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపు సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణలో రెండు మంత్రి పదవులను తమ సామాజికవర్గానికి కేటాయించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, మున్నూరుకాపు కార్పొరేషనుకు రూ.2వేల కోట్లను కేటాయించాలని, కోకాపేటలో ఆత్మగౌరవ భవనానికి మరో రూ.20కోట్లను మంజూరు చేయాలన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకోటి రాజు, కార్యదర్శి వాసాల వెంకన్న, ఆర్వీ మహేందర్, గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు దేశెట్టి శివ, నర్సింగ్‌రావు, వాసాల రాజు, రాజబాబు, రవి, సాయిని శ్రీను, నిరంజన్, మొగిలి దుర్గాప్రసాద్, ఉమారాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

- ఎస్‌బీఐ ప్యాట్నీ సెంటర్ డిప్యూటీ జీఎం రవీందర్ హిట్నాలి

సికింద్రాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రాణదానమైన రక్తదానం ప్రతి ఒక్కరూ చేయవలసిన అవశ్యకత ఎంతైనా ఉందని ఎస్‌బీఐ ప్యాట్నీ సెంటర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రవీందర్ హిట్నాలి అభిప్రాయపడ్డారు. ఎస్‌బీఐ బ్యాంకు డే వేడుకల్లో భాగంగా శనివారం ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్‌బీఐ సికింద్రాబాద్ అడ్మిన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుత ప్రపంచంలో చాలా మంది రక్తం అందక మృతి చెందుతున్నారని అన్నారు. తలసేమియా రోగులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ ద్వారా తలసేమియా రోగులకు అందచేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎస్‌బీఐ హెచ్‌ఆర్ సుందరం, డాక్టర్ కే.శశిధర్, ఎస్‌బీఐ ఓఏ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఐ.కృష్ణంరాజు, ఏ.గిరిధర్ పాల్గొన్నారు.

తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

మారేడుపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు శంకర్ యాదవ్ ఇటీవల మరణించిన నేపథ్యంలో శనివారం రాత్రి వెస్ట్ మారేడుపల్లిలోని శంకర్ యాదవ్ నివాసానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విచ్చేసి శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ, కార్పొరేటర్ కొంతం దీపికలతో పలువురు ఉన్నారు.

12 నుంచి చేనేత ఎక్స్‌పో

బర్కత్‌పుర, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడానికి, ఆత్మహత్యలను నివారించడానికి ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని పద్మశాలీ సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఈనెల 12, 13, 14వ తేదీలలో పద్మశాలీ భవన్‌లో చేనేత ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షురాలు రూపసదాశివ, సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, సంఘం యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జి భాస్కర్‌లు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో 45 చేనేత స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈనెల 12న ఉదయం 10 గంటలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చేనేత కమిషనర్ శైలజారామయ్యార్ ముఖ్యఅతిథులుగా హాజరై ఎక్స్‌పోను ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో బి.మధుసూదన్, దేవేందర్, రాంచందర్, అంబటి శ్రీనివాస్, స్వప్న, నోముల రేఖ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో మంచినీటికి కటకట

ఏఈ స్రవంతిని నిలదీసిన మహిళలు

- అప్పటికప్పుడు ట్యాంకర్ తెప్పించిన ఏఈ
- రెండు నెలల నుంచి ఇదే పరిస్థితి
- జాడలేని అడ్డగుట్ట కార్పొరేటర్
- ఎమ్మెల్యే పద్మారావు దృష్టికి నీటి సమస్య

అడ్డగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పైప్‌లైన్ మరమ్మతులు జరుగుతున్నాయని సాకు చెబుతూ రెండు నెలలుగా మంచినీళ్లు రాకపోవడంతో అడ్డగుట్ట మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల నుంచి అడ్డగుట్ట మజీద్ వద్ద ఉన్న రెండు వందల కుటుంబాలకు మంచినీటి సరఫరా కావడంలేదని వారు తెలిపారు. అక్కడెక్కడో పైప్‌లైన్ మరమ్మతులు చేస్తే తమ బస్తీకి నీళ్లు ఎందుకు రావని మహిళలు ప్రశ్నిస్తున్నారు. మరో ఏరియాలో రోజు విడిచి రోజు 45 నిమిషాలు సరఫరా అవుతున్నా, ముందుగా మురికి నీరు సరఫరా అవుతుందని, దీంతో తాము నీళ్లు కొనుక్కోవలసి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లు రావడంలేదని మహిళలు రోడ్డు ఎక్కడంతో విషయం తెలుసుకున్న జలమండలి ఏఈ స్రవంతి శుక్రవారం ఘటనా స్థలానికి రాగానే ఏఈని మహిళలు నిలదీశారు. దీంతో అప్పటికప్పుడు ఒక ట్యాంకర్ నీళ్లు బస్తీకి తెప్పించడంతో బస్తీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. రేపటి పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. రోజు విడిచి రోజు నీళ్లు వస్తాయనుకుంటే మధ్యాహ్నం నీళ్లు రావడంతో ఉద్యోగాలకు వెళ్లే మహిళలు నీళ్లు పట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య పరిష్కారం కాకపోతే మారేడుపల్లి జలమండలి జీఎంను కలిసి సమస్యను వివరిస్తామని అడ్డగుట్ట మహిళలుచెప్పారు.



అడ్డగుట్టలో మజీద్ వద్ద జలమండలి ఏఈ స్రవంతితో అడ్డగుట్ట మహిళలు



నల్లాలో నీళ్లు రాకపోవడంతో బయటి నుంచి నీళ్లు తెస్తున్న మహిళ



ఇంట్లో మంచినీటి నల్లాలో నీళ్లు రావడంలేదని చూపిస్తున్న మహిళలు

కార్పొరేటర్ పట్టించుకోవడంలేదు

అడ్డగుట్ట మజీద్ వద్ద గత రెండు నెలల నుంచి మంచినీళ్లు రావడంలేదని పదే పదే స్థానిక అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మికి ఫిర్యాదు చేసినా, కనీసం వచ్చి కూడా సమస్య పరిష్కారం చేయలేకపోతుంది. మా బాధలు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుకు సైతం ఫిర్యాదు చేశాం. ఎన్నికలప్పుడు గుంపులు గుంపులుగా వచ్చి ఓటు వేయమని అడిగి ఓట్లు వేయించుకుంటారు. తాగేందుకు నీళ్లు కూడా ఇవ్వకపోతే మా బతుకులు ఏంకావలి, ఎంతాగి బతకాలి అంటున్నారు. కార్పొరేటర్ ఇప్పటి వరకు ఒక్కసారైనా తమ బస్తీకి రాలేదని మహిళలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అడ్డగుట్ట మజీద్ వద్ద బజారు నల్లా వేయించాలని బస్తీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

దిగొచ్చిన కార్పొరేటర్

అడ్డగుట్ట ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని భావించిన అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అప్పటికప్పుడు గుట్టుచప్పుడు గాకుండా జలమండలి జీఎం వినోద్ కుమార్‌ను కలిసి పెండింగ్ పనులను పూర్తిచేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. టెండర్ ప్రక్రియ పూర్తియిన పనులను త్వరగా ప్రారంభించాలని జీఎంను కోరారు. అదేవిధంగా అడ్డగుట్ట సీడీ సెక్షన్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులను త్వరగా ప్రారంభించాలని వినతిపత్రం ద్వారా కోరారు.



వాటర్ వర్క్స్ జీఎంకు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్

రెండు రోజుల్లో నీటి సరఫరా ఉంటుంది

అడ్డగుట్ట డివిజన్‌లో కొన్నిచోట్ల మంచినీటి పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా నీళ్లు సరిగ్గా రావడంలేదన్న మాట వాస్తవమే. పైప్‌లైన్ ఎక్కడ బాగాలేదో గుర్తించేందుకు నిరంతరం కష్టపడుతున్నాం. అందరికీ నీళ్లు ఇవ్వాలన్నదే మా లక్ష్యం. ఎవరికీ ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నాం. అడ్డగుట్ట మజీద్ వద్ద ఉన్న మ్యాన్‌హోల్ వద్ద లీకేజీ ఉండడంతో వెంటనే పనులు మొదలు పెట్టాం. ఇలాంటి సమస్య రాకుండా చూస్తాం

\- ఏఈ స్రవంతి

నీళ్లు రావడంలేదని మొత్తుకుంటున్నాం

రెండు నెలలుగా మంచినీరు రావడంలేదని మొత్తుకుంటున్నాం. రోజు విడిచి రోజు సరఫరా అవుతున్న మంచినీరు ఇళ్లలో ఉన్న నల్లాలో నీరు రావడంలేదు. బయటి నుంచి తెచ్చుకుంటున్నాం. తాగేందుకు నీళ్లు ఇవ్వరా ఇదేం బాధ మాకు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేయాలి. ఎవరికి చెప్పుకోవాలి. నీళ్లు రాని రోజు పని బంద్ చేసి ఇంటి వద్దే నీళ్ల కోసం వేచి ఉంటున్నాం. తీరా నీళ్లు రాకపోతే మా పరిస్థితి ఏమిటి, ఇప్పటికైనా సమస్య పరిష్కరించండి.



\- సరోజ, అడ్డగుట్ట

నీళ్ల కోసం నరకం చూస్తున్నాం

మంచినీళ్లు లేకుంటే బతుకు లేదు. తాగేందుకు నీళ్లు లేకపోవడంతో ఎలా జీవించాలి, రోజు విడిచి రోజున నీళ్ల కోసం ఆటో డ్యూటీ విడిచిపెట్టి నీళ్ల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నీళ్లు రాకపోవడంతో గత్యంతరం లేక నీళ్లు కొనుక్కోవాల్సి వస్తుంది. రోజంతా కష్టపడితే పొట్టనిండని అడ్డగుట్టలో నీళ్ల కోసం నానా తిప్పలు పడుతున్నాం. ఇప్పటికైనా సకాలంలో నీళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.



\- చోటు, ఆటో డ్రైవర్

ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారానికి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కృషి చేయాలి

- ప్రొ.గాలి వినోద్ కుమార్

తార్నాక, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం షెడ్యూల్ 9, 10 అంశాల పరిష్కారానికి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కావడం శుభపరిణామమని దక్షిణ భారత జేఏసీ కో-ఆర్డినేటర్ కమిటీ కన్వీనర్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు, గత 30సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ భేటీలో చర్చించి పరిష్కారానికై కృషిచేయాలని శనివారం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎస్సీ వర్గీకరణ సమస్యను ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకువెళ్ళి 371డి అధికరణ సవరణకు కృషి చేసినట్లయితే ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, నారాచంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు తలారి శ్రీనివాస్ తదితరులు

చెత్తకుప్పలు, మురికినీటి కాల్వలపై జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ కెమికల్ స్ప్రే

సికింద్రాబాద్, పద్మారావునగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): 'బాబోయ్ దోమలు' శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించిన వార్తకు జీహెచ్‌ఎంసీ అధికార యంత్రాంగం స్పందించింది. జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది గాంధీ ఆస్పత్రి వెనుక రోడ్డు, బోయగూడ, ఐడీహెచ్ కాలనీ, సీసీ నగర్ పరిసర ప్రాంతాలలో చెత్త కుప్పలను, మురికి నీటి కాల్వలు, నిల్వలను గుర్తించి, కెమికల్ స్ప్రే చేశారు. దీనిపై స్థానికులు ఆంధ్రజ్యోతి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.



గాంధీ ఆస్పత్రి వెనుక రోడ్డులో కెమికల్ స్ప్రే చేస్తున్న ఎంటమాలజీ విభాగం

వర్గీకరణ జరగకపోతే నిప్పురాజేస్తాం

వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ ఏర్పాటు చేసుకుని 30 ఏళ్లు గడుస్తున్నా సంబరాలు చేసుకోవాల్సింది పోయి వర్గీకరణ జరగకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 7న దీక్షా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు తానే బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పుకునే మందకృష్ణ మాదిగ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తానని చెప్పి 10 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మాదిగ జాతిని మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, శ్రీను, యాదగిరి, వేణుగోపాల్, కృష్ణ, నరేష్, రాహుల్, కొల్లూరి వెంకట్, చందు, జీవన్, నాగరాజు, సురేష్, మణి పాల్గొన్నారు.

'పెంపుడు జంతువులకు యాంటీరేబిస్ తప్పనిసరి'

పద్మారావునగర్, జులై 6 (ఆంధ్రజ్యోతి): తమ ఇళ్లలో పెంచుకొంటున్న పెంపుడు జంతువులకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయంచాలని బోయగూడ వెటర్నరీ ఆస్పత్రి ప్రొఫెసర్, ఇన్‌చార్జి ఎస్.అయోధ్య తెలియజేశారు. ప్రపంచ జోనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బోయగూడలోని పి.వి.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌కు అనుబంధంగా పనిచేస్తున్న వెటర్నరీ ఆస్పత్రిలో పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్.అయోధ్య మాట్లాడుతూ...ప్రతీ సంవత్సరం జులై 6వ తేదీన ప్రపంచ జోనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటీ రేబీస్ వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. జులై 6, 1885 రోజున ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ యాంటీ రాబీస్ వ్యాక్సిన్ విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా జోనోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలి పారు. దాదాపుగా 220 యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు పెంపుడు జంతువులకు వేశామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు జీవన్‌జ్యోతి, మోహితాశ్రీ, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



శునకానికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న ప్రొఫెసర్.ఎస్.అయోధ్య, వైద్య సిబ్బంది



చిలకలగూడ గాంధీబొమ్మ వద్ద డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



ఎల్‌ఓసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ పత్రాలు అందజేత

మారేడుపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లికి చెందిన కనకయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిశారు. ఈమేరకు స్పందించిన ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా బాధితుడికి శస్త్ర చికిత్స నిమిత్తం రెండు లక్షల 50 వేల రూపాయలు (సీఎంఆర్‌ఎఫ్ - ఎల్‌ఓసీ) మంజూరు చేయించి తన క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఓసీ పత్రాలను కనకయ్య కుటుంబ సభ్యులకు శ్రీగణేష్ అందజేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని రైలు ఢీకొని అక్కడికక్కడే మరణించిన ఘటన లాలాగూడ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం లాలాగూడ - సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ మార్గమధ్యలో మల్కాజిగిరికి చెందిన రాజేష్ (37) టెంట్‌హౌజ్ దుకాణం నడుపుతున్నాడు. శనివారం ఉదయం రైలు పట్టాలు దాటుతున్న సమయంలో వేగంగా దూసుకొచ్చిన రైలు ఢీకొట్టడంతో బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రైలు ఢీకొని మృతి చెందిన రాజేష్

వృద్ధురాలి మృతి

అడ్డగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో వృద్ధురాలి మృతదేహాన్ని మార్చురీకి తరలించిన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మాధవి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో మెట్రో కేఫ్ వద్ద గుర్తుతెలియని 65ఏళ్ల వృద్ధురాలు చనిపోయి ఉందన్న సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి ఆచూకీ తెలిస్తే వెంటనే 8712661249 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



వృద్ధురాలి మృతదేహం

సికింద్రాబాద్‌లో గంజాయి పట్టివేత

అడ్డగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో ముగ్గురు సభ్యుల ముఠా గంజాయి విక్రేతల్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాలు ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా జీ పాయింట్ హోటల్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు హోటల్ వద్ద మాటువేశారు. ఒడిస్సాకు చెందిన ఎల్తేరియా పరిచ(40) బుదాదేబ్ (44), చందన్‌సింగ్‌లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి నుంచి ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసును గోపాలపురం పోలీసులకు అప్పగించారు. విక్రేతలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒడిస్సా నుంచి గంజాయి సరుకును తీసుకొచ్చి అధిక ధరలకు సికింద్రాబాద్‌లో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ముగ్గురినీ గోపాలపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న శ్రీకిషన్ మాదిగ, కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ నాయకులు



బోయిన్‌పల్లి సంజీవయ్యకాలనీలోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జంపనప్రతాప్, ముప్పిడి మధుకర్



ఈస్ట్ మారేడుపల్లి అంబేద్కర్‌నగర్ బస్తీలో జరిగిన బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకల్లో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ మాజీ చైర్మన్ సి.సంతోష్ యాదవ్

బోయిన్‌పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక సామరస్యత కోసం శ్రమించిన మానవతావాది, మహోన్నత మూర్తి బాబు జగ్జీవన్‌రామ్ అని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పేర్కొన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ నాయకులు శ్రీకిషన్ మాదిగ కంటోన్మెంట్ ఒకటవ వార్డులోని బోయిన్‌పల్లి సంజీవయ్యకాలనీలో గల డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద స్థానికులు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈస్ట్ మారేడుపల్లి అంబేద్కర్‌నగర్ బస్తీలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ఆలయ మాజీ చైర్మన్ సి.సంతోష్ యాదవ్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు అంబేద్కర్‌నగర్ ఎస్సీ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి వేడుకలకు కమిటీ సభ్యులు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు నివాళుర్పించారు. పికెట్‌లోని బాబు జగజీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆయన వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి.



బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గజ్జల నాగేష్